క్లుప్తంగా

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న జనార్దన్

హుజూరాబాద్: సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీసీ సీటిజన్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు చందుపట్ల జనార్దన్ కుమారుడి స్మారకార్థం మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలో బుధవారం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. గ్రామంలోని క్రీడాకారులకు టోర్నమెంట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చందుపట్ల పరందాములు, మాజీ ఉప సర్పంచ్ చందుపట్ల రాజేందర్ తదితరులు ఉన్నారు.

భవనం నిర్మించాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

హుజూరాబాద్: పట్టణంలోని 29వ వార్డు మహిళలు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. వార్డులోని ప్రభుత్వ భూమిలో మహిళా సంఘం భవనం నిర్మించాలని గతంలో అధికారులు విన్నవించామని, కానీ ఆ స్థలం పీహెచ్‌సీకి మంజూరైనందునా దాన్ని చోటుకి ప్రాంతానికి బదిలీ చేసి మహిళా కమ్యూనిటీ భవన నిర్మించాలని వినతిపత్రంలో కోరారు.

రైతుకు ఆర్థికసాయం



నగదు అందిస్తున్న లచ్చన్న, తదితరులు

గంగాధర: మండలంలోని కాచిరెడ్డిపల్లి గ్రామ రైతు దేశెట్టి వీరమల్లయ్యకు చెందిన రెండు ఎద్దులు ఇటీవల పిడుగుపాటుతో మృతి చెందాయి. దీంతో ఆర్థికంగా నష్టపోయిన రైతుకు ఓ వ్యక్తి అండగా నిలిచాడు. మల్లాపూర్ గ్రామానికి చెందిన తూడి లచ్చన్న బాధిత రైతును బుధవారం పరామర్శించి రూ.పదివేలు అందించాడు. వెంట మాజీ సర్పంచు జోగు సాగర్, ఠాగూర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

ఇల్లందకుంట: మండల పరిధిలోని రైతులకు జీలుగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు, శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థాన చైర్మన్ ఇంగిలే రామారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా రైతులకు విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేస్తోందని, ఇల్లందకుంట, సిరిసేడు, మల్యాల గ్రామాలలో వంద క్వింటాళ్ల విత్తనాలు ఉన్నాయని రైతులు వినియోగించుకోవాలన్నారు. రైతులకు వ్యవసాయ అవసరాలకు ఏవో, ఏఈవో లను సంప్రదించాలని తెలిపారు. జీలుగ విత్తనాలు పొలంలో చల్లడం ద్వారా ఎరువుగా మారి అధిక దిగుబడి వస్తుందన్నారు.

శుభ్రత పాటించాలి



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో బుధవారం ఉపాధిహామీ కూలీలకు సీజనల్ వ్యాధులపై కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది అవగాహన చేశారు. వర్షాకాలంలో వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై పాటించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి నర్సయ్య, ఏఎన్ఎం శ్రీవాణి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటార్ అందజేత



జమ్మికుంట: మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయానికి వొడితెల ప్రణవ్ రూ.30 వేలు విలువ చేసే బోరు మోటార్ అందించారు. ఈసందర్భంగా గ్రామస్తులు ప్రణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయినేని రాజేశ్వర్‌రావు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బాపురావు, ఆలయ కమిటీ చైర్మన్ దుగ్గినాల రవీందర్, గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, వైస్ చైర్మన్ తూముల తిరుపతిరావు, కోశాధికారి రాజు, సభ్యులు రాజేశ్వర్‌రావు, అవి ర్నినేని రవీందర్ రావు హర్షం వ్యక్తం చేశారు.



కరాటే శిక్షణలో విద్యార్థులు



జ్ఞాపకశక్తి పెంచుకోవడానికి చెస్ ఆడుతూ



క్యారం ఆడుతున్న చిన్నారులు

హోం టు గ్రౌండ్

- వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో చిన్నారుల సందడి
- మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో వివిధ క్రీడల్లో తర్ఫీదు
- ఉదయం, సాయంత్రం స్నాక్స్ ఇచ్చేందుకు ముందుకొస్తున్న దాతలు
- వివిధ క్రీడల్లో విద్యార్థులు బీజీ

హుజూరాబాద్: వేసవి సెలవుల్లో అమ్మమ్మ, నానమ్మ ఇంటికో వెళ్దామని చూసే చిన్నారులు కొందరైతే.. సెలవులు వచ్చాయి కాదా సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లు పట్టుకొని గేమ్స్ ఆడితే సరిపోతుందని భావించే విద్యార్థులు మరికొందరు. వేసవి సెలవులు చాలా విలువైనవి. అలాంటి సెలవుల్లో శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడే క్రీడాంశాల్లో నైపుణ్యం పెంపొందించుకుంటే సమయం ఎంతో సద్వినియోగమవుతుంది. విద్యార్థులు సెలవులు వృథాకాకుండా హుజూరాబాద్ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో ప్రత్యేక వేసవి క్రీడా శిబిరాన్ని నిర్వహిస్తోంది. వివిధ క్రీడల్లో విద్యార్థులు తర్ఫీదు పొందుతున్నా. గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేసే విద్యార్థులతో ఉదయం, సాయంత్రం సందడిగా ఉంటోంది. మే చివరి వరకు కొనసాగే క్యాంపులో ఆసక్తి ఉన్న క్రీడల్లో శిక్షణ ఇస్తూ మెలకువలు నేర్పుతుండడంతో 'ఫ్యూచర్ చాంప్స్'లో జోష్ కనిపిస్తోంది. సమ్మర్ మొత్తం ఇంట్లోనే గడపిన చిన్నారులు ప్రస్తుతం మైదానాల బాటపట్టారు. ఇష్టమైన క్రీడల్లో ఎలాంటి సాధన లేక ఇంటికే పరిమితమైన విద్యార్థులతో ఇప్పుడు మైదానాలు నిండుకుంటున్నాయి.

నైపుణ్యం కలిగిన మాస్టర్లతో శిక్షణ

విద్యార్థులు సెలవులు వృథా చేసుకోకుండా ఉండేందుకు మున్సిపల్‌శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. నైపుణ్యం కలిగిన మాస్టార్లతో విద్యార్థులకు ఉచితంగా క్రీడాంశాల్లో తర్ఫీదు ఇప్పిస్తున్నారు. క్యారం, చెస్, డ్యాన్స్, కరాటే, కబడ్డీ, ఖోఖో తదితర క్రీడల్లో విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు.

విద్యార్థుల్లో జోష్..

వేసవి క్రీడా శిబిరం అనగానే పిల్లలకు ఎక్కడ లేని ఉత్సాహం వస్తోంది. ఇప్పటివరకు వారిలో ఉన్న నిరాశ నిస్పృహలన్నీ తొలగిపోయాయి. ఉదయం ఆరుగంటల నుంచి ఎనిమిది గంటల వరకు సాయంత్రం ఐదు నుంచి ఏడు గంటల వరకు ఎండ తీవ్రత లేని సమయాల్లో శిక్షణ ఇస్తుండటంతో విద్యార్థుల్లో జోష్ కనిపిస్తోంది. ఉల్లాసంగా.. ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొంటూ శిక్షణ పొందుతున్నారు.

ఉదయం, సాయంత్రం గుడ్లు, పాలు, పండ్లు

క్రీడల్లో మునిగితేలుతున్న విద్యార్థుల్లో మరింత జోష్ నింపేందుకు పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు స్నాక్స్ ఇచ్చేందుకు ముందుకొస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళ గుడ్లు, పాలు, పండ్లు అందిస్తున్నారు. దాతలు, మున్సిపల్‌శాఖ సహకారంతో ఎలాంటి రుసుము లేకుండా విద్యార్థులు వివిధ క్రీడలు నేర్చుకుంటున్నారు.

ఆనందంగా ఉంది



వేసవి సెలవులను వృథా చేయకుండా ఉండేందుకు మున్సిపల్‌శాఖ ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొనడం ఆనందంగా ఉంది. శిబిరంలో ప్రతిరోజు సాయంత్రం చెస్ నేర్చుకుంటున్నాను. చెస్ ద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

– శివసాయి, విద్యార్థి, హుజూరాబాద్

కరాటే నేర్చుకుంటున్నాను



ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకుంటున్నాను. కరాటే ద్వారా నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. సెలవులు వృథా చేయకుండా వందశాతం ఫోకస్‌తో ఆత్మరక్షణ విద్య నేర్చుకుంటున్నాను. ఉచితంగా నేర్పిస్తున్నా మున్సిపల్ శాఖాధికారులకు కృతజ్ఞతలు.

– సిరి, విద్యార్థిని, హుజూరాబాద్

క్రీడల్లో రాణించాలి



పిల్లలు సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోతున్నారు. క్రీడలు మానసికోల్లాసం, శారీరక దారుఢ్యానికి ఎంతో ఉపయోగపడతాయి. ఇష్టమైన క్రీడల్లో శిక్షణ పొంది రాణించాలి. దాతల సహకారంతో ఉదయం, సాయంత్రం వేళ స్నాక్స్ కూడా అందిస్తున్నాం.

సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, హుజూరాబాద్

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



లబ్ధిదారురాలుకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు: చొప్పదండి నియోజకవర్గంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని షానగర్ గ్రామ పరిధిలోని ఓ ప్రవేట్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. గత బీఆర్ఎస్ పాలనలో ఒక్కరికి ఇల్లు మంజూరు కాలేదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మండలంలో 523 మందికి ఇళ్లు మంజూరయ్యాయని, లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మాణం పూర్తి చేసుకొని రాష్ట్రంలో నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలపాలన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు అవసరమైన ఇసుక అందజేయడంలో అధికారులు పూర్తి సహకారం అందించాలని సూచించారు. నియోజకవర్గంలో 3,500 మందికి ఇళ్లు కట్టించడం జరుగుతుందని, ఇళ్లు రానివారికి రెండో విడతలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్తు సీఈవో శ్రీనివాస్, కొక్కెరకుంట సింగిల్ విండో చైర్మన్ మురళీకృష్ణారెడ్డి, గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తిరుమల, వైస్ ప్రెసిడెంట్ సత్యంరెడ్డి, ఎంపీడీవో రాజేశ్వరీ, తహసీల్దార్ రాజేశ్వరీ, మండల ప్రత్యేకాధికారి అనిల్‌ప్రకాశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరీశ్ ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలి



మాట్లాడుతున్న అంగిడికుమార్, తదితరులు

జమ్మికుంట: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఫీజు వసూలు చేస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలపై ఫీజు నియంత్రణ చట్టం అమలు చేసి పేద విద్యార్థులకు విద్య అందించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో పీడీఎస్‌యూ మండల సమావేశం నిర్వహించి నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు లాభాల వేటలో అక్రమంగా అడ్మిషన్లు చేసుకుంటూ విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నాయని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అందరికి సమాన, నాణ్యమైన విద్యా అందించాలని డిమాండ్ చేశారు. జూన్ 7న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నూతన మండల కమిటీ అధ్యక్షుడు తాళ్లపెల్లి అంజి, ప్రధాన కార్యదర్శి తుమ్మ అరవింద్, ఉపాధ్యక్షులు అంబాల ప్రసన్నకుమార్, అభిషేక్, సహాయ కార్యదర్శులు పెల్లబోయిన చందు, తాళ్లపల్లి అభినయ్, కోశాధికారి సింగిరెడ్డి సహచన్‌రెడ్డి, కమిటీ సభ్యులు బండారి రిషిక్, రావుల విగ్నేష్, గాడే అరుణ్, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం వార్తలు

ఎక్సైజ్ అధికారుల దాడులు

హుజూరాబాద్: హుజూరాబాద్ ఎక్సైజ్‌శాఖ అధికారులు బుధవారం పలుచోట్ల దాడులు నిర్వహించారు. పట్టణంలోని ఓ వైన్స్‌షాపులో మద్యానికి సంబంధించి రికార్డుల నిర్వహణ సరిగ్గా లేనందున కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ బి.శ్రీనివాసులు తెలిపారు. బోర్నపల్లి, కందుగుల గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టుషాపు నిర్వాహకుల నుంచి మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

అట్రాసిటీ కేసు

జమ్మికుంట: కులం పేరుతో దూషించిన ఇద్దరిపై బుధవారంకేసు నమోదు చేశామని టౌన్ సీఐ ఎస్ రామకృష్ణ తెలిపారు. మండలంలోని వెంకటేశ్వరపల్లికి చెందిన నాగెల్లి ఒంకార్‌ను అదే గ్రామానికి చెందిన రామడుగు పాపారావు, తిరుపతమ్మ దంపతులు కులం పేరుతో దూషించారని బాధితుని ఫిర్యాదుతో ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

దాడి చేసిన ముగ్గురిపై..

దాడికి పాల్పడి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. రామడుగు తిరుపతమ్మ, పాపారా వులు కౌలు తీసుకున్న భూమిలో వ్యవసాయ పనులు చేస్తుండగా నాగేల్లి ఓంకార్, రామడుగు వెంకటరావు, కుమార్ దాడి చేశారు. తిరుపతమ్మ ఫిర్యా దుతో ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

స్నాక్స్ తయారీ కేంద్రం సీజ్

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ఓ స్నాక్స్ తయారీ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ ఆదేశాల మేరకు బుధవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్ బుధవారం సీజ్ చేశారు. ఇటీవల జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అంకిత్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. తినుబండరాల తయారీ కేంద్రాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని, ఆహారంలో హానికర కలర్స్, నాణ్యత లేని నూనె, ఆరోగ్యానికి చేడు కలిగించే వివిధ వస్తువులు వినియోగిస్తున్నట్లు గుర్తించారని, ఉన్నత అధికారుల ఆదేశాల ఈ మేరకు తయారీకి సంబంధించిన మిషనరీలను కార్యాలయానికి తరలించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కట్నం వేధింపుల కేసులో ఒకరికి జైలు

కరీంనగర్‌క్రైం: ఆడపిల్ల పుట్టిందని భార్యను అదనపు కట్నం కోసం వేధించి అవమానించడంతో.. ఆమె తన కుమార్తెతో సహా బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న నేరంలో నిందితుడు భర్త బూర్ల గణేశ్(34)కు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కరీంనగర్ ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి జె.కవిత బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఇల్లందకుంట మండలం మల్యాలకు చెందిన మామిడి రమ్యకు అదే మండలం వంతడుపులకు చెందిన బూర్ల గణేశ్‌తో వివాహమైంది. వివా హ సమయంలో కట్నకానుకలు చెల్లించారు. కొద్ది రోజులకు వీరికి ఒక పాప జన్మించింది. పాప జన్మించిన కొద్ది రోజుల నుంచి తల్లితండ్రుల ప్రోద్బలంతో గణేశ్ తన భార్యను అదనపు కట్నం కోసం వేధించగా.. పంచాయితీలు నిర్వహించినా అతడిలో మార్పు రాలేదు. భర్త, అత్త, మామ వేధింపులు భరించలేక 2018 సెప్టెంబర్ 19న ఉదయం రమ్య తన కూతురు మనుశ్రీతో కలిసి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. రమ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఇల్లందకుంట పోలీసులు గణేశ్‌తోపాటు అతడి తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలూరు శ్రీరాములు విచారించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి గణేశ్‌కు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధించారు. మిగతా ఇద్దరిపై నేరం నిరూపణ కాకపోవడంతో వారిని నిర్దోషులుగా విడుదల చేశారు.

సన్మానం



సన్మాన గ్రహీతలతో కాలనీవాసులు

హుజూరాబాద్: పట్టణంలోని సిద్ధార్థనగర్ కాలనీకి చెందిన జూనియర్ సివిల్ జడ్జి మానస, వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగి దాసరి సరళ, పోలీస్‌శాఖలో పదోన్నతి పొందిన బండ సంపత్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ స్వరూప ముత్యంరావును కాలనీ అసోసియేషన్ సభ్యులు బుధవారం సన్మానించారు. అధ్యక్షుడు సాగి వీరభద్రరావు మాట్లాడుతూ... కష్టపడి ఉన్నత లక్ష్యంతో ఎదిగిన వారిని సన్మానించడం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కాలనీకి చెందిన వారు వివిధ హోదాల్లో ఉండటం ఆనందంగా ఉందన్నారు. ప్రముఖులను సన్మానించినవారిలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, నాయకులు తోట రాజేంద్రప్రసాద్, ముత్యవవు, పీవీ సేవా సమితి అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మనోజ్, రవీందర్, తిరుపతిరెడ్డి, మాడ రాజిరెడ్డి, రాజమౌళి, సీడ్స్ సంపత్‌రావు, శ్రీనివాస్, రవీందర్ తదితరులున్నారు.

వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడుకి..



సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

హుజూరాబాద్: వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు కొమురవెల్లి హరిప్రసాద్‌ను బుధవారం పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైశ్యులు వ్యాపారంతో పాటు ఇతర రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు హరిశంకర్, గర్రెపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్, శశిధర్, శివ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

చొప్పదండి: చొప్పదండి సీఐగా ఏ. ప్రదీప్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి సీఐ ప్రకాశ్‌గౌడ్ బదిలీపై వెళ్లారు. ఎస్ఐ సురేందర్, సిబ్బంది సీఐకి స్వాగతం పలికారు.



చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామ పరిధి లాలయ్యపల్లిలో అంబేద్కర్ యువజన సంఘం వద్ద మిషన్‌భగీరథ పైపులైన్ లీకేజీతో మంచినీరు వృథాగా పోతోంది. కొన్ని నెలలుగా లీకేజీతో కాలనీవాసులకు అందాల్సిన నీరు మురుగునీటి కాల్వలోకిపోతుడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి లీకేజీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, లీకేజీకి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సువిశాల, ప్రత్యేక అధికారి,ఏఈ చిగురుమామిడి సెల్ నం : 7995660448

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

చిగురుమామిడిలో పోచమ్మ బోనాలు



బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

చిగురుమామిడి: చిగురుమామిడిలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. బుధవారం డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, బైండ్ల కళాకారుల ఆటపాటల మధ్య మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు సారయ్య, రాజయ్య, రాములు, కుమారస్వామి, అజయ్ పాల్గొన్నారు.



బీరప్ప ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

ఘనంగా బీరప్ప ఉత్సవాలు

గంగాధర: మండలంలోని తాడిజర్రి గ్రామంలో బీరప్ప ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం బీరప్పస్వామి కామరాతిదేవి కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వెంట నాయకులు మేచినేని నవీన్‌రావు, ఆకుల మధుసుదన్,రామిడి సురేందర్, యాదవ సంఘం నాయకులు ఉన్నారు.

సురవరం ప్రతాపరెడ్డికి నివాళి



నివాళి అర్పిస్తున్న తహసీల్దార్ సురేఖ, తదితరులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం సురవరం ప్రతాపరెడ్డి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి తహసీల్దార్ సురేఖ, జర్నలిస్టులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పత్రికా రంగానికి, జర్నలిస్టులకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. శంకరపట్నం జర్నలిస్ట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, ఏఎస్సై సుధాకర్, బస్వయ్య, మహిపాల్, రాములు, సమ్మయ్య, తిరుపతి, మల్లారెడ్డి, జర్నలిస్టులు వెంకటేశ్, వెంకటస్వామి, సంతోష్, సాగర్, రవీందర్, కిరణ్, రంజిత్, సుధాకర్, అనిల్, ప్రణదీప్, సంపత్‌రెడ్డి, సుధీర్, రాకేశ్, అనిత్, నరేశ్, సురేశ్, గట్టయ్య, పోచయ్య పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

సైదాపూర్: మండలంలోని వెన్నంపల్లిలో అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యతిపతి అరుణ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. గ్రామస్తులకు చట్టాలు, న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు వెంకటేశ్వర్‌రావు, కుమారస్వామి, భానుకిరణ్, హరిహరన్, సంతోష్, కాంగ్రెస్ నాయకులు రాజిరెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

కమిటీల పేరుతో కాలయాపన

సప్తగిరికాలనీ(కరీంనగర్): కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన ఐదు డీఏలు వెంటనే ప్రకటించాలని టీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్లా అన్నారు. కరీంనగర్‌లో ఉద్యోగ విరమణ పొందుతున్న టీఎస్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బండ నర్సిండరెడ్డి కార్యక్రమంలో బుధవారం పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, కాలవ లక్ష్మణ్, అహ్మద్, అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌కుమార్, రహమతుల్లా, సత్యనారాయణ పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి

కరీంనగర్‌కల్చరల్: నిజాం నిరంకుశ వ్యతిరేక పోరాట యోధుడు, జాతీయ ఉద్యమ నాయకుడు, తెలంగాణ తొలి మలిదశ ఉద్యమ నాయకుడు, మాజీ మంత్రి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రభుత్వం ప్రకటించాలని కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు రాపోలు జ్ఞానేశ్వర్, తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ వాసాల రమేశ్, తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం గౌరవ అధ్యక్షుడు మెతుకు సత్యం అన్నారు. కరీంనగర్‌లోని పద్మశాలీ సంక్షేమ ట్రస్ట్ భవన్లో బుధవారం కొండా లక్ష్మణ్ బాపూజీ పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లా పద్మశాలీ సంఘం ప్రధాన కార్యదర్శి వొల్లాల కృష్ణహరి, కోశాధికారి అల్స భద్రయ్య, పోపా జిల్లా అధ్యక్షుడు పోలు సత్యనారాయణ, నాయకులు జెల్ల నరేందర్, రవికుమార్, అనుమల్ల రాజు, పాము రాజేశం తదితరులున్నారు.

అల్గునూర్ సీవోఈని తరలించొద్దు

కరీంనగర్: అల్గునూర్ సీవోఈని తరలించొద్దు.. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆటలు ఆడొద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాంపెల్లి అరవింద్, గజ్జల శ్రీకాంత్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీవోఈని తరలించొద్దని, 12 గురుకులాలను ఎత్తేయడాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలో గురుకులాల విద్యార్థుల చదువులకు తీవ్ర నష్టం ఏర్పడుతుందని, సమస్యలు పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం మంచి ఫలితాలతో విద్యారంగంలో కరీంనగర్‌కు మంచి పేరు తీసుకొస్తున్న విద్యార్థులు నేడు చదువులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిణి కనీసం అపాయింట్మెంట్ కూడా ఇవ్వడం లేదని వాపోయారు. మంత్రి పొన్నం ప్రభాకర్, అలుగు వర్షిణి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు వినయ్, సహాయ కార్యదర్శి ఆకాశ్, సభ్యులు రాకేశ్, సన్నీ, నాయకులు వరుణ్, మనోజ్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.